
సాక్షి
జగిత్యాల
శుక్రవారం । 10 । నవంబర్ । 2023



షుగర్ ఫ్యాక్టరీ తెరిపించాలి

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోనే వ్యవసాయ ఆధారిత పరిశ్రమగా గుర్తింపు పొందింది మల్లాపూర్ మండలం ముత్యంపేటలోని నిజాం చక్కెర ఫ్యాక్టరీ. IIలో▸



కొనుగోళ్లు వెలవెల

జిల్లాలో వరి కోతలు ప్రారంభమైన సుమారు 20 రోజులు గడుస్తోంది. దిగుబడి కూడా కొనుగోలు కేంద్రాలకు చేరుతోంది. IIలో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
32.0/21.0

వాతావరణం పొడిగా ఉంటుంది. ఆకాశం మేఘావృతమై, కొన్నిచోట్ల చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

మంత్రి హరీశ్‌రావు వాహనం తనిఖీ



హరీశ్‌రావు వాహనాన్ని తనిఖీ చేస్తున్న పోలీసులు

కొండగట్టు(చొప్పదండి): కొండగట్టు ఆంజనేయ స్వామిని దర్శించుకునేందుకు వచ్చిన మంత్రి హరీశ్‌రావు వాహనాన్ని గురువారం కొడిమ్యాల మండలం దొంగలమర్రి చెక్‌పోస్ట్ వద్ద పోలీసులు తనిఖీ చేశారు. మంత్రి తన వాహనాన్ని ఆపి పోలీసులకు సహకరించారు.

చట్టాలపై అవగాహన ఉండాలి

- మెట్‌పల్లి జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ అరుణ్‌కుమార్



గురుకులంలో మాట్లాడుతున్న మేజిస్ట్రేట్ అరుణ్‌కుమార్

మెట్‌పల్లిరూరల్: చట్టాలపై ప్రతిఒక్కరికీ అవగాహన కలిగి ఉండాలని మెట్‌పల్లి జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ అరుణ్‌కుమార్ అన్నారు. గురువారం మెట్‌పల్లి మండలం పెద్దాపూర్ గురుకులం విద్యాలయంలో నిర్వహించిన న్యాయవిజ్ఞాన సదస్సులో హాజరై మాట్లాడారు. నేటి విద్యార్థులే రేపటి పౌరులని, చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు. 18 ఏళ్లలోపు వారు వాహనాలు నడపొద్దని సూచించారు. తప్పు చేస్తే మైనర్‌కూ చట్టప్రకారం శిక్ష పడుతుందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ విద్యాసాగర్, బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, అధ్యాపకులు పాల్గొన్నారు.

వినియోగదారుల పట్ల మర్యాదగా మెలగాలి



మాట్లాడుతున్న ఎస్‌ఈ సత్యనారాయణ

కోరుట్ల: వినియోగదారులతో విద్యుత్ సిబ్బంది మర్యాదగా మెలగాలని ఎన్పీడీసీఎల్ జిల్లా ఎస్‌ఈ సత్యనారాయణ అన్నారు. పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో గురువారం కోరుట్ల టౌన్, రూరల్ సబ్ డివిజన్ పరిధిలోని విద్యుత్ సిబ్బందితో అంతర్గత సమర్థత, అభివృద్ధిపై శిక్షణ ఇచ్చారు. వినియోగదారులతో మర్యాదగా ప్రవర్తించాలని, వారి సమస్యలను పరిష్కరించాలని సూచించారు. సిబ్బంది విధులు, బాధ్యతలపై ప్రతిజ్ఞ చేయించారు. 33 కేవీ, 11 కేవీ లైన్లను పరిశీలిస్తూ మరమ్మతు చేయించాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఏఓ తిరుపతయ్య, మెట్‌పల్లి డీఈ తిరుపతి, రవీందర్, ఆంజనేయరావు, రఘుపతి, నరేష్‌కుమార్, వెంకటేశ్వర్లు, ఏడీఈలు, ఏఈలు, ఇంజినీర్లు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి

- జిల్లా సెర్ఫ్ మార్కెటింగ్ డీఎం మల్లేశం




తేమ శాతాన్ని పరిశీలిస్తున్న డీఎం మల్లేశం

జగిత్యాల రూరల్: ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలని జిల్లా సెర్ఫ్ మార్కెటింగ్ డీఎం మల్లేశం అన్నారు. జగిత్యాల అర్బన్ మండలం గోపాల్‌రావుపేట, రూరల్ మండలం పొలాస, గుల్లపేట, తక్కళ్లపల్లి, కల్లెడ ఐకేపీ కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. ధాన్యం విక్రయించగానే ఆధార్‌కార్డు, పట్టాపాస్‌బుక్, బ్యాంక్ పాస్‌బుక్ జిరాక్స్‌లను నిర్వాహకులకు అప్పగించి పేరు నమోదు చేసుకోవాలన్నారు. జిల్లా సెర్ఫ్ పై నాన్స్ డీపీఎం విజయభారతి, ఏపీఎం గంగాధర్, సీసీలు విద్యాసాగర్, మంగ పాల్గొన్నారు.

రికార్డుల పరిశీలన

సారంగాపూర్: మండలంలోని రేచపల్లి ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రాన్ని డీఎంహెచ్‌వో శ్రీధర్ గురువారం సందర్శించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. గర్భిణుల వివరాలు, టీకాలు, క్షయ, లెప్రసీ, జ్వరాల నమోదు, మందుల వివరాలు, సిబ్బంది హాజరుశాతంపై ఆరా తీశారు. ఆయన వెంట ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు, సిబ్బంది ఉన్నారు.

వస్తా మీ వెనకా..



- పతికి మద్దతుగా సతి
- డమ్మీ నామినేషన్ వేసిన ఎమ్మెల్యే అభ్యర్థుల సతీమణులు
- కోరుట్లలో బీఆర్‌ఎస్ అభ్యర్థికి తండ్రి..
- ఉమ్మడి జిల్లాలో ఇప్పటివరకు 314 సెట్లు దాఖలు

సాక్షిప్రతినిధి,కరీంనగర్: రాజకీయాల్లో నమ్మకం అనేది చాలా విలువైనది. ఏమాత్రం అవకాశం దొరికినా.. వెన్నుపోట్లు ఎదురవుతాయి. అందుకే, ప్రతీ నాయకుడు తాను వేసే అడుగుల్లో ముందు తన కుటుంబసభ్యులే నడవాలని కోరుకుంటారు. నామినేషన్ వేసే దశ నుంచే ఈ మేరకు ముందుజాగ్రత్త చర్యలు తీసుకుంటారు. అభ్యర్థులు ఎన్నికల సంఘానికి సమర్పించే నామినేషన్ అఫిడవిట్‌లో సమస్యలు తలెత్తే అవకాశాలు లేకపోలేదు. అలాంటి సమయంలో నామినేషన్ తిరస్కరణకు గురయ్యే అవకాశాలుంటాయి. ఈ క్రమంలో ముందుచూపుతోనే ఒకప్పుడు నాయకుడు తమకు నమ్మకస్తులైన అనుచరులతో డమ్మీ నామినేషన్ వేయించేవారు. రానూరాను రాజకీయాల్లో వెన్నుపోట్ల సంప్రదాయం పెరిగిపోవడంతో నేతలు కుటుంబసభ్యులతోనే డమ్మీ నామినేషన్ వేయిస్తున్నారు. అంతా బాగుంది అనుకున్న తర్వాత తమవారి కోసం తిరిగి నామినేషన్ ఉపసంహరించుకుంటారు.



- ఈటల: హుజూరాబాద్ బీజేపీ అభ్యర్థి, ఎమ్మెల్యే ఈటల రాజేందర్ సతీమణి జమున ప్రతీ ఎన్నికల సందర్భంగా డమ్మీ నామినేషన్ వేస్తున్నారు. గతంలో ఇలా ఏడుసార్లు వేశారు. ఇప్పుడు కూడా డమ్మీ నామినేషన్ వేశారు.



- కవ్వంపల్లి: కాంగ్రెస్ అభ్యర్థి కవ్వంపల్లి సత్యనారాయణ భార్య అనురాధ నామినేషన్ వేశారు. మానకొండూరు నుంచి ఈసారి ఎలాగైనా గెలవాలని కవ్వంపల్లి దంపతులు సర్వశక్తులు ఒడ్డుతున్నారు.



- పుట్ట: బీఆర్‌ఎస్ మంథని అభ్యర్థి, మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు సతీమణి, మున్సిపల్ చైర్‌పర్సన్ శైలజ ఆయనకు డమ్మీగా నామినేషన్ వేశారు. ఇలా వేయడం ఇది మూడోసారి.



- ఆది: కాంగ్రెస్ వేములవాడ అభ్యర్థి ఆది శ్రీనివాస్ సతీమణి వనజ నామినేషన్ వేశారు. గతంలో చందుర్తి జెడ్పీటీసీ సభ్యురాలిగా పనిచేసిన ఆమె ఇప్పటివరకు నాలుగుసార్లు ఇలా వేశారు.



- చల్లా: మంథని బీఎస్పీ అభ్యర్థి చల్లా నారాయణ రెడ్డి ప్రస్తుతం కాటారం పీఏసీఎస్ చైర్మన్‌గా ఉన్నారు. ఆయనకు డమ్మీ అభ్యర్థిగా భార్య సుజాత నామినేషన్ వేశారు. ఈమె గతంలో జెడ్పీటీసీ సభ్యురాలిగా పని చేశారు.

- కల్వకుంట్ల: కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు వారసుడిగా ఆయన కుమారుడు సంజయ్ ఈసారి ఎన్నికల బరిలో ఉన్నారు. కుమారుడికి రాజకీయాలు కొత్త కావడంతో తండ్రే అన్నీ తానై చూసుకుంటున్నారు. ఎందుకైనా మంచిదన్న ఆలోచనతో తానే డమ్మీగా నామినేషన్ కూడా వేశారు.



జంగ్ తెలంగాణ

నామినేషన్లకు నేడే ఆఖరు

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని 12 నియోజకవర్గాల్లో 214 మంది అభ్యర్థులు మొత్తం 314 సెట్ల నామినేషన్లు వేశారు. ఏకాదశి కావడంతో గురువారం భారీగా నామినేషన్లు దాఖలయ్యాయి. నేటి(శుక్రవారం)తో గడువు ముగియనుండటంతో మరిన్ని నామినేషన్లు రావొచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు.

నియోజకవర్గం	అభ్యర్థులు	వచ్చిన నామినేషన్లు
కరీంనగర్	17	25
చొప్పదండి	10	15
మానకొండూర్	15	23
హుజూరాబాద్	23	34
సిరిసిల్ల	14	23
వేములవాడ	15	20
పెద్దపల్లి	22	31
రామగుండం	19	24
మంథని	13	21
జగిత్యాల	37	60
కోరుట్ల	16	21
ధర్మపురి	13	17
మొత్తం	214	314

మీకు తెలుసా?

ఏ-ఫాం.. బీ- ఫాం అంటే?

కరీంనగర్ అర్బన్: ఎన్నికలొచ్చాయంటే ఏ-ఫాం, బీ-ఫాం పదాలు చర్చకొస్తుంటాయి. 25ఏళ్లు నిండినవారు ఎవరైనా ఎన్నికల్లో పోటీ చేసేందుకు అర్హులు కాగా.. పార్టీ గుర్తు రావాలంటే ఫాంలతోనే సంబంధం. పార్టీ తరఫున ఎన్నికల రిటర్నింగ్ అధికారికి అందజేసే పత్రమే బీ-ఫాం. తమ పార్టీ నుంచి ఫలానా వ్యక్తి పోటీపడుతున్నారని, పార్టీ గుర్తు కేటాయించాలని అభ్యర్థించడమే ఈ పత్రం ముఖ్య ఉద్దేశం. ఇక ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థిని ధ్రువీకరించేందుకు జాతీయ పార్టీ అధ్యక్షుడు, రాష్ట్రస్థాయిలో ఒకరికి అధికారం అప్పగిస్తారు. ఈ ప్రక్రియనే ఏ-ఫాం కాగా.. అధికారం పొందిన వ్యక్తి అభ్యర్థికి బీ-ఫాం జారీ చేస్తారు. రాష్ట్రస్థాయి గుర్తింపు పొందిన పార్టీ అధ్యక్షుడు తాను లేదా మరొకరికి లేదా జిల్లా స్థాయిలో ఒకరికి బీ-ఫాం జారీ చేసే అధికారాన్ని అప్పగిస్తుందని ఏ-ఫాం సూచిస్తుంది. ఏ-ఫాం ద్వారా అధికారం పొందిన వ్యక్తి పోటీచేసే అభ్యర్థికి బీ-ఫాం ఇస్తారు. ఏ-ఫాం, బీ-ఫాం పత్రాలు నామినేషన్ దాఖలు సమయంలో లేదా నామినేషన్ చివరి రోజు మధ్యాహ్నం 3గంటల్లోగా సంబంధిత రిటర్నింగ్ అధికారికి అందించాలి.

మిగిలింది ఒక్కరోజే..!

- నేటితో ముగియనున్న నామినేషన్ల పర్వం
- ఇప్పటికే దాఖలు చేసిన ప్రధాన పార్టీల అభ్యర్థులు
- గురువారం ఒక్కరోజే 30 దరఖాస్తులు
- జగిత్యాలలో 12, కోరుట్లలో 10, ధర్మపురిలో 8 నామినేషన్లు



నామినేషన్ వేస్తున్న మంత్రి కొప్పుల ఈశ్వర్

జగిత్యాల: నామినేషన్లకు మిగిలింది శుక్రవారం ఒక్కరోజే. ఇప్పటికే ప్రధాన పార్టీల అభ్యర్థులందరూ నామినేషన్ వేశారు. గురువారం మంచి ముహూర్తం ఉండడంతో జగిత్యాల నుంచి 12 నామినేషన్లు, కోరుట్ల నుంచి 10, ధర్మపురి నుంచి ఎనిమిది నామినేషన్లు దాఖలయ్యాయి. జగిత్యాలలో బీఆర్‌ఎస్ పార్టీ తరఫున సంజయ్‌కుమార్ నాలుగుసెట్లు దాఖలు చేశారు. స్వతంత్ర అభ్యర్థులుగా ప్రశాంత్‌కుమార్, కోటగిరి మోహన్, గోపి చంద్రయ్య, బీయూ యునైటెడ్ ఫ్రంట్ తరఫున బొల్లం సతీశ్‌కుమార్, ధర్మసమాజ్ పార్టీ నుంచి దుబ్బ చైతన్యకుమార్, విద్యార్థుల రాజకీయపార్టీ నుంచి భూక్య నందు, బీజేపీ నుంచి బండారి శ్రావణి రెండుసెట్లు నామినేషన్ వేశారు. ధర్మపురి నుంచి బీఆర్‌ఎస్ పార్టీ తరఫున మంత్రి కొప్పుల ఈశ్వర్ రెండుసెట్లు దాఖలు చేశారు. స్వతంత్ర అభ్యర్థులుగా దూడ మహిపాల్, మెడపట్ల దుబ్బయ్య, తీగల శేఖర్, ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ నుంచి భూత్కూరి కాంత, ధర్మసమాజ్ పార్టీ నుంచి దూడ తిరుపతి, గణ సురక్ష పార్టీ నుంచి మోతె నరేశ్ దాఖలు చేశారు. కోరుట్ల నుంచి కాంగ్రెస్ తరఫున జువ్వాడి నర్సింగారావు, స్వతంత్ర అభ్యర్థులుగా ముత్యం రఘు, కొండ చంద్రమాణిక్యం, మానుక ప్రవీణ్, వేముల విక్రంరెడ్డి, మన తెలంగాణ రాష్ట్ర సమైక్య పార్టీ నుంచి పోతు నాగార్జున్, బహుజన ముక్తి పార్టీ నుంచి రఘువీర్‌కుమార్ దయ్యా, ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ నుంచి చెన్నమనేని శ్రీనివాస్‌రావు, బహుజన సమాజ్ పార్టీ నుంచి నిషాంత్ కార్తికేయ, ఉత్తర్ రాష్ట్ర తెలంగాణ పార్టీ నుంచి దండు ధనుంజయ్ నామినేషన్లు దాఖలు చేశారు.

పోలింగ్ కేంద్రాల్లో వసతులు కల్పించాలి

- కలెక్టర్ యాస్మిన్ బాషా



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

జగిత్యాల: పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని కలెక్టర్ యాస్మిన్ బాషా అన్నారు. గురువారం అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఈనెల 30న జరగనున్న శాసనసభ ఎన్నికలకు సంబంధించి పట్టణాలు, గ్రామాల్లో ఉన్న పోలింగ్ కేంద్రాల్లో తాగునీరు, విద్యుత్, మరుగుదొడ్లు, ఫ్యాన్, ర్యాంప్, రేలింగ్ సౌకర్యాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఎలాంటి లోపాలు లేకుండా చూడాలని, మున్సిపల్ వర్కర్లను నియమించుకోవాలని ఆదేశించారు. జిల్లా పంచాయతీ అధికారులు, విద్యాశాఖ, మున్సిపల్, ఇంజినీరింగ్ అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. మోడల్ పోలింగ్ కేంద్రాలు, మహిళ, యువత, దివ్యాంగులకు ప్రత్యేకించి పోలింగ్ కేంద్రాల్లో వసతులతోపాటు, అందంగా అవసరమైన పనులను చేపట్టి తీర్చిదిద్దాలన్నారు. అదనపు కలెక్టర్ లత పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి కళోత్సవ్ పోటీలకు రాయికల్ విద్యార్థులు



విద్యార్థులతో ప్రధానోపాధ్యాయులు రాఘవులు

రాయికల్: పట్టణంలోని జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు రాష్ట్రస్థాయి కళోత్సవ్ పోటీలకు ఎంపికయ్యారు. శాస్త్రీయ నృత్య విభాగంలో గోసికొండ దీక్షిత, స్వదేశీయ బొమ్మల ఆటల విభాగంలో చైతన్య, దృశ్యకళ విభాగంలో మల్లేశ్ ఎంపికైనట్లు ప్రిన్సిపల్ శ్రీపతి రాఘవులు తెలిపారు. వారిని ఉపాధ్యాయులు పొన్నం రమేశ్, మండలోజు రవీందర్, మల్లేశం, గంగజమున, పీఈటీ సుజాత అభినందించారు.

అభివృద్ధి కోసం బీఆర్‌ఎస్‌ను గెలిపించండి



ఆటో డ్రైవర్లతో కలిసి సెల్ఫీ దిగుతున్న కోరుట్ల ఎమ్మెల్యే అభ్యర్థి సంజయ్

- బీఆర్‌ఎస్ కోరుట్ల అభ్యర్థి కల్వకుంట్ల సంజయ్
- ప్రచారంలో పాల్గొన్న సంజయ్ సతీమణి

మెట్‌పల్లి: అభివృద్ధి కోసం ప్రజలు మరోసారి బీఆర్‌ఎస్‌కు మద్దతు ఇవ్వాలని ఆ పార్టీ కోరుట్ల అభ్యర్థి కల్వకుంట్ల సంజయ్ అన్నారు. పట్టణంలో గురువారం ఆటో డ్రైవర్లతోపాటు పలు కుల సంఘాలతో సమావేశమయ్యారు. ఎన్నికల్లో తనకు అండగా నిలవాలని విజ్ఞప్తి చేశారు. నాలుగు పర్యాయాలు ఎమ్మెల్యేగా ఎన్నికైన తన తండ్రి విద్యాసాగర్‌రావు నియోజకవర్గాన్ని ఎంతో అభివృద్ధి చేశారని.. తనను గెలిపిస్తే మరింత అభివృద్ధి చేస్తానని వివరించారు. సంజయ్ తల్లి సరోజన 17వార్డులో ఇంటింటి ప్రచారం నిర్వహించారు.

పట్టణంలో సంజయ్ సతీమణి దీప్తి ప్రచారం



ఎన్నికల ప్రచారంలో సంజయ్ సతీమణి దీప్తి

కోరుట్ల:పట్టణంలోని తొమ్మిదో వార్డులో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి కల్వకుంట్ల సంజయ్ సతీమణి కల్వకుంట్ల దీప్తి గురువారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. దీప్తి మాట్లాడుతూ తనమామ, ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు హయాంలో కోరుట్ల నియోజకవర్గం ఎంతో అభివృద్ధి చెందిందన్నారు. తన భర్త సంజయ్‌ను గెలిపించాలని కోరారు. కేసీఆర్ భరోసా కార్యక్రమాలను ఓటర్లకు వివరించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ అన్నం లావణ్య, కౌన్సిలర్లు పోగుల ఉమారాణి, ఆడెపు కమల, బట్టు రాధిక, యాటం పద్మ, బలిజ పద్మ, కో-ఆప్షన్ సభ్యురాలు, రెంజర్ల కళ్యాణి పాల్గొన్నారు.

30 ఏళ్లలో జరగని అభివృద్ధి మూడేళ్లలో చేశా..

- మరోసారి అవకాశమిస్తే అద్భుతంగా తీర్చిదిద్దుతా
- జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్
- బీఆర్‌ఎస్ అభ్యర్థిగా నామినేషన్
- గులాబీమయమైన జిల్లాకేంద్రం



నామినేషన్ సందర్భంగా సంజయ్‌కుమార్‌ను గజమాలతో సత్కరిస్తున్న కార్యకర్తలు, అభిమానులు

జగిత్యాల: ప్రజలు ఆశీర్వదిస్తే ఎమ్మెల్యేగా గెలిచిన తాను 30 ఏళ్లలో జరగని అభివృద్ధిని కేవలం మూడేళ్లలోనే చేసి చూపించానని, మరోసారి అవకాశమిస్తే అద్భుతంగా తీర్చిదిద్దుతానని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ అన్నారు. గురువారం ఆయన బీఆర్‌ఎస్ అభ్యర్థిగా నామినేషన్ వేశారు. ముందుకు జిల్లాకేంద్రంలో భారీ ప్రదర్శన చేపట్టారు. ఎమ్మెల్సీ రమణ, మాజీమంత్రి రాజేశంగౌడ్, జెడ్పీచైర్‌పర్సన్ దావ వసంతతో కలిసి ఆర్డీవో కార్యాలయానికి వెళ్లి ఎన్నికల అధికారి, ఆర్డీవో నర్సింహమూర్తికి నామినేషన్ పత్రాలు సమర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడారు. ఎమ్మెల్సీ కవిత ప్రోత్సాహంతో రాజకీయాల్లోకి వచ్చానన్నారు. నేత్ర వైద్యుడిగా ప్రజలకు చేసిన సేవలను గుర్తించి 2014లో సీఎం కేసీఆర్ టికెట్ ఇచ్చారని, తొలిసారి ఓటమి చెందినా ప్రజలకు అందుబాటులో ఉంటూ.. 2018లో పోటీ చేయగా ప్రజలు భారీ మెజార్టీ ఇచ్చి ఆశీర్వదించారని గుర్తు చేశారు. కరోనా వెంటాడినా 30 ఏళ్లలో ఎవరూ చేయని అభివృద్ధిని మూడేళ్లలోనే తను చేసి చూపించానని పేర్కొన్నారు. జగిత్యాలను జిల్లా కేంద్రంగా చేయడంతోపాటు, మెడికల్ కళాశాల, 100 పడకల మాతాశిశు సంక్షేమ కేంద్రం తెచ్చానని, 650 పడకల మల్టీస్పెషాలిటీ ఆస్పత్రిని ఏర్పాటు చేశానని వెల్లడించారు. పట్టణంలో సెంట్రల్ లైటింగ్, పార్క్‌లు, ఓపెన్‌జిమ్‌లు ఏర్పాటు చేశామన్నారు. రాష్ట్రంలో ఎక్కడ లేని విధంగా జగిత్యాలలో 4,570 డబుల్‌బెడ్‌రూంలు నిర్మించి పేద ప్రజలకు అందించామన్నారు. స్వచ్ఛ సర్వేక్షణ్‌లో దేశంలోనే 751 జిల్లాల్లో జగిత్యాల రెండోస్థానంలో నిలిచిందని, కేంద్రప్రభుత్వమే అవార్డు ఇచ్చిందన్నారు. కేంద్రంలోని బీజేపీ ఢిల్లీలో అవార్డులు ఇస్తూనే గల్లీలో లొల్లి చేస్తోందని ఆరోపించారు. బీజేపీ నాయకులు నానాటికీ దిగజారిపోతున్నారన్నారు. సంస్కారం, సంస్కృతి, సంప్రదాయాలు వీడిందన్నారు. 2018లో ఓటమి చెందిన జీవన్‌రెడ్డి ప్రశ్నించేందుకే ఉన్నానంటూ ఎమ్మెల్సీ ఎన్నికల్లో నిలబడితే గెలిపించారని, మరి ప్రశ్నించేందుకు జీవన్‌రెడ్డికి ఇంకా రెండేళ్ల సమయం ఉందని, ఈ సమయంలో పోటీ ఎందుకోసమని ఎద్దేవా చేశారు. నియోజకవర్గం, ప్రజలే తన కుటుంబ సభ్యులని, అభివృద్ధికి ఎంతో కృషి చేస్తానన్నారు.



నామినేషన్ వేస్తున్న సంజయ్‌కుమార్



జిల్లాకేంద్రంలో కార్యకర్తలు, అభిమానుల సందడి

భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.

గులాబీమయమైన జగిత్యాల

ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ నామినేషన్ వేసే కార్యక్రమానికి ప్రజలు భారీగా తరలివచ్చారు. దీంతో జిల్లాకేంద్రం గులాబీమయమైంది. ముందుగా మోతెరోడ్‌లోని పార్టీ కార్యాలయం నుంచి ర్యాలీ నిర్వహించారు. బైపాస్‌రోడ్ మీదుగా ప్రారంభమైన ర్యాలీ మార్కండేయ ఆలయం నుంచి యావర్‌రోడ్, కొత్తబస్టాండ్ మీదుగా టవర్‌సర్కిల్, మోతీబజార్, పాతబస్టాండ్ వరకు కొనసాగింది. కళాకారులు, కార్యకర్తలు, నాయకులు తరలివచ్చి పూలవర్షం కురిపించారు. కొత్తబస్టాండ్‌లో సంజయ్‌కుమార్‌ను గజమాలతో సత్కరించారు.

క్లుప్తంగా

శిక్షణ ఐపీఎస్‌ను సన్మానించిన ఎస్పీ



శివమారుతిరెడ్డిని సన్మానిస్తున్న ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్

జగిత్యాలక్రైం: కోరుట్ల మండలం అయిలాపూర్ గ్రామానికి చెందిన ఏనుగు శివమారుతిరెడ్డి యూపీఎస్సీ సివిల్స్‌లో 131వ ర్యాంక్ సాధించి ఇండియన్ పోలీస్ సర్వీస్‌కు ఎంపికై ప్రస్తుతం శిక్షణలో ఉన్నారు. గురువారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్‌ను మర్యాదపూర్వకంగా శివమారుతిరెడ్డి కలిశారు. ఎస్పీ అతడితో పాటు ఆయన తండ్రి అంజిరెడ్డిని ఘనంగా సన్మానించి ప్రత్యేకంగా అభినందించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



ఎంపికైన మోడల్ స్కూల్ విద్యార్థులు

జగిత్యాలరూరల్: కండ్లపల్లి మోడల్ స్కూల్‌కు చెందిన కావ్యశ్రీ, హర్షిత, అమూల్య రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ నాగసుధారాణి తెలిపారు. ఈనెల 11 నుంచి 13 వరకు మహబూబ్‌నగర్‌లో జరగనున్న అండర్–19 బాలురు, బాలికల ఉమ్మడి కరీంనగర్ జిల్లా బాస్కెట్‌బాల్ జట్టుకు ఎంపికయ్యారు. గురువారం వీరిని ప్రిన్సిపాల్ నాగసుధారాణి, పీడీ వినీత్, అజీమ్, ఉపాధ్యాయులు అభినందించారు.

ఉమ్మడి జిల్లా బాస్కెట్‌బాల్ కోచ్‌గా అజీమ్



అజీమ్

జగిత్యాలరూరల్: కండ్లపల్లి మోడల్ స్కూల్ పీఈటీగా పని చేస్తున్న అజీమ్ ఈనెల 11 నుంచి 13 వరకు మహబూబ్‌నగర్ జిల్లాలో జరగనున్న అండర్–19 బాలురు, బాలికల బాస్కెట్‌బాల్ ఉమ్మడి కరీంనగర్ జిల్లా టీం కోచ్‌గా వ్యవహరించనున్నారు. అజీమ్‌ను పాఠశాల ప్రిన్సిపాల్ నాగసుధారాణి, ఉపాధ్యాయులు గురువారం అభినందించారు.

జనవిజ్ఞాన వేదిక పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు

జగిత్యాల: సీవీ రామన్ జయంతి పురస్కరించుకొని జన విజ్ఞాన వేదిక జిల్లా వేదిక ఆధ్వర్యంలో రూపొందించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ బృందం మాట్లాడుతూ.. జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ప్రగతికి తొలిమెట్టు ప్రశ్న అనే కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. నవంబర్ 7 నుంచి ఫిబ్రవరి 7 వరకు జరుగుతుందని, అందరూ పాల్గొనాలన్నారు. జిల్లా సైన్స్ అధికారి బాజోజి శ్రీనివాస్, కోరుట్ల మండల అధికారి నరేశ్, గౌరవ అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్, తులసి ఆగమయ్య, రాంప్రసాద్, రాములు, ధరణ్‌దీప్ పాల్గొన్నారు.

షుగర్ ఫ్యాక్టరీకి పూర్వ వైభవం తేవాలి

- తొమ్మిదేళ్లుగా కళ తప్పిన పరిశ్రమ
- తెరిపిస్తే మేలంటున్న ఈ ప్రాంత ప్రజలు

సాక్షి పీపుల్స్ ఎజెండా



షుగర్ ఫ్యాక్టరీ

మెట్‌పల్లి: ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోనే వ్యవసాయ ఆధారిత పరిశ్రమగా గుర్తింపు పొందింది మల్లాపూర్ మండలం ముత్యంపేటలోని నిజాం చక్కెర ఫ్యాక్టరీ. ఈ పరిశ్రమ ఈ ప్రాంతానికే తలమానికంగా ఉండేది. చెరుకు పంట సాగుతో భూములు.. ఉద్యోగులు, కార్మికులతో ఫ్యాక్టరీ కళకళలాడుతుండేది. ఫ్యాక్టరీ మూసివేతతో తొమ్మిదేళ్లుగా ఆ కళ తప్పిపోయింది. పంట విస్తీర్ణం కూడా గణనీయంగా పడిపోయింది. సిబ్బంది ఉపాధి కోల్పోయి రోడ్డున పడ్డారు. ఈ క్రమంలో ఆ ఫ్యాక్టరీని తెరిపించాలనే అభిప్రాయాన్ని ఈ ప్రాంత ప్రజలు వ్యక్తం చేస్తున్నారు.

సందడిగా ఉండేది



ముత్యంపేట చక్కెర ఫ్యాక్టరీతో ఈ ప్రాంతానికి ప్రత్యేక గుర్తింపు ఏర్పడింది. క్రషింగ్ సీజన్ వచ్చిందంటే ఎంతో సందడిగా ఉండేది. ప్రస్తుతం ఫ్యాక్టరీని మూసివేయడం వల్ల చెరుకు పండించే రైతులు నిరాశకు గురవుతున్నారు. యేటా క్రషింగ్‌కు దూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోంది. ఫ్యాక్టరీని తెరిచే ఆలోచన చేయాలి.

– గంగోని క్రాంతి, రైతు, బండలింగాపూర్

తెరిస్తేనే ఉపాధి



చక్కెర ఫ్యాక్టరీ నడిస్తే వందలాది మందికి ఉపాధి దొరుకుతుంది. పంట సాగు విస్తీర్ణం కూడా పెరుగుతుంది. మూసివేయడం ద్వారా ఫ్యాక్టరీలోని పరికరాలు తుప్పు పట్టిపోయాయి. క్వార్టర్స్ దెబ్బతింటున్నాయి. ఫ్యాక్టరీని తెరిపించడానికి అందరూ ప్రయత్నించాలి. ఈ ప్రాంతానికి పూర్వవైభవం తెచ్చే ప్రయత్నం చేయాలి. – తులసీ ఆగమయ్య, ఉపాధ్యాయుడు, మెట్‌పల్లి

సమష్టిగా కృషి చేయాలి



ఫ్యాక్టరీ నడిస్తే వ్యాపారపరంగా ఈ ప్రాంతానికి ప్రయోజనం కలుగుతుంది. స్థానికంగా ఉన్న వారికి ఉపాధి అవకాశాలు కూడా పెరుగుతాయి. అన్ని వర్గాల ప్రజలు, రైతులు పునరుద్ధరించాలని కోరుకుంటున్నారు. మూసివేత వ్యవహారంపై విమర్శలు చేసుకోకుండా అన్ని పక్షాలు ఏకమై తెరిపించడానికి కృషి చేయాలి.

– తిరుపతిరెడ్డి, ఫార్టిలైజర్ వ్యాపారి, మెట్‌పల్లి

150 రోజులు దీక్ష



చక్కెర ఫ్యాక్టరీ తెరవాలని గత జూన్ 5న కొండగట్టు ఆంజనేయ స్వామి ఆలయంలో పూజలు చేసి దీక్ష చేపట్టిన. 150 రోజుల పాటు కొనసాగిస్తానని మొక్కుకున్నాను. ఇందులో భాగంగానే రోజులో ఒక్కపూట మాత్రమే భోజనం చేస్తున్నాను. చెప్పులు ధరించకుండా ఉంటున్నాను. ఫ్యాక్టరీ తెరిచే వరకూ గడ్డం తీయను. – నారాయణరెడ్డి, చెరుకు ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షుడు

ఉదయం ప్రచారాలు.. సాయంత్రం విందులు



పెగడపల్లి: సాధారణ ఎన్నికల వేళ గ్రామాల్లో ఎన్నడూ కనిపించని నాయకులు ప్రజల ముందుకొస్తున్నారు. ఉదయం గ్రామీణులు లేవకముందే గ్రామంలో ప్రత్యక్షమవుతున్నారు. సమయం దాటితే పొలాలకు వెళ్తారని భావించి ముందే గ్రామానికి చేరుకుంటున్నారు. సూర్యోదయం ప్రచారాన్ని పార్టీ నాయకులు, కార్యకర్తలు సాయంత్రం వరకు నిరంతరంగా కొనసాగించి.. సూర్యాస్తమయానికి పార్టీ కార్యాలయాలు, సొంతగూటికి చేరుకుంటున్నారు. ప్రచారం ముగిసిన అనంతరం జల్సాలో మునిగి తేలుతున్నారు. ఎన్నికల నిబంధనలు అడ్డొస్తాయని ముందే పసిగట్టిన పార్టీల నాయకులు మద్యాన్ని ముందే సిద్ధం చేసుకుంటున్నారు. గ్రామాల్లో గొలుసు దుకాణాలకు క్లైం పడడంతో.. ఈ విషయంలో ముందస్తు జాగ్రత్త నాయకులకు తప్పడం లేదు. నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో పరిస్థితి ఇలాగే ఉంది. కార్యకర్తల్లో ఉత్సాహం నింపేందుకు ఇలాంటి దావత్‌లు నిర్వహించడం సాధారణంగా భావిస్తున్నారు. ప్రజలు మాత్రం అన్ని పార్టీల అభ్యర్థులకు హామీ ఇస్తున్నారు. పీఠం ఎవరిని వరిస్తుందో వేచిచూడాలని ప్రజలు చర్చించుకుంటున్నారు.

హక్కులను సద్వినియోగం చేసుకోవాలి

- సంక్షేమాధికారి భాస్కర్

జగిత్యాల: ప్రస్తుత సమాజంలో బాలురతో పాటు బాలికలకు కూడా సమాన హక్కులున్నాయని, వాటిని వినియోగించుకోవాలని సంక్షేమాధికారి భాస్కర్ అన్నారు. గురువారం బాలల హక్కుల వారోత్సవాల సందర్భంగా బాలసదనంలో చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. బాలికలు వారికున్న హక్కుల గురించి తెలుసుకొని వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రతిభ కనబర్చినవారికి బహుమతులు అందజేశారు. జిల్లా బాలల పరిరక్షణాధికారి హరీశ్, పీవోఐసీ కరుణశ్రీ, సూపరింటెండెంట్ వీరలక్ష్మీ, బాలసదనం అధ్యాపక బృందం పాల్గొన్నారు.



బాలసదనంలో బాలికలకు పోటీలు

సీఎం కేసీఆర్ పథకాలు దేశానికే ఆదర్శం

- రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల



ధర్మపురిలో మాట్లాడుతున్న కొప్పుల

ధర్మపురి: ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రవేశపెట్టిన పథకాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. ధర్మపురి నియోజకవర్గ కేంద్రంలో గురువారం బీఆర్‌ఎస్ తరఫున నామినేషన్ సమర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ.. గడిచిన 9 ఏళ్ల పాలనలో తెలంగాణ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశారన్నారు. అంతకుముందు ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్దపెల్లి పార్లమెంట్ సభ్యుడు వెంకటేష్‌నేత, డీసీఎమ్మెస్ చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి, జెడ్పీటీసీలు బత్తిని అరుణ, బాదినేని రాజేందర్, మున్సిపల్ చైర్‌పర్సన్ సంగి సత్తమ్మ, ఏఎంసీ చైర్మన్ అయ్యోరి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో 15 మహిళా పోలింగ్ కేంద్రాలు

- డీపీవో దేవరాజు

ఇబ్రహీంపట్నం: జిల్లాలోని 3 అసెంబ్లీ స్థానాల్లో 15 మహిళ పోలింగ్ కేంద్రాలు, 15 మోడల్ పోలింగ్ కేంద్రాలు, యంగ్ పోలింగ్ కేంద్రాలు, వికలాంగుల పోలింగ్ కేంద్రాలను ఏర్పాట్లు చేస్తున్నట్లు జిల్లా పంచాయతీ అధికారి దేవరాజ్ తెలిపారు. గురువారం ఇబ్రహీంపట్నంలోని ప్రాథమిక పాఠశాలలో ఒక పోలింగ్ కేంద్రాన్ని మహిళ పోలింగ్ కేంద్రంగా గుర్తించడంతో.. ఈ కేంద్రంలో వసతులను పరిశీలించారు. ఈ పోలింగ్ కేంద్రంలో మహిళ అధికారులే విధులు నిర్వహిస్తారని తెలిపారు. కోమటికొండాపూర్ ప్రాథమిక పాఠశాలలో మోడల్ పోలింగ్ కేంద్రంగా గుర్తించామని, ఈ కేంద్రంలో అన్ని వసతులుంటాయన్నారు. జగిత్యాల, కోరుట్ల, ధర్మపురి నియోజకవర్గాల్లో ఒక్కో కేంద్రం వికలాంగులకు కేటాయించినట్లు తెలిపారు. ఎంపీడీవో ప్రభు, ఎంపీవో కృపాకర్ పాల్గొన్నారు.

వర్గీకరణ పోరాటం తుది దశకు..



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

సారంగాపూర్: ఏబీసీడీ వర్గీకరణ పోరాటం తుది దశకు చేరిందని, హైదరాబాద్‌లో ఈనెల 11న జరిగే విశ్వరూప మహాసభకు ప్రధాని రావడం సాక్ష్యమని ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ జిల్లా కోకన్వీనర్ బెజ్జంకి సతీష్ మాదిగ అన్నారు. గురువారం బీర్‌పూర్ మండలం కొల్వాయి గ్రామంలో విశ్వరూప మహాసభ పోస్టర్‌ను ఆవిష్కరించారు. వర్గీకరణ కోసం ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు 29 సంవత్సరాలుగా సుదీర్ఘ పోరాటం చేస్తున్నారన్నారు. నాయకులు చంద్రయ్య, రాజు, బోనగిరి అంజయ్య, గజ్జెల మహేశ్, నారపాక గంగాధర్, పసుల రాకేశ్, పసుల శేఖర్, పసుల రంజిత్, కొత్త రజజిత్, సముద్రాల మధుకర్, కొత్త రాజయ్య, పసుల సాజన్, పసుల విష్ణువర్ధన్, పసుల మల్లేష్, బోనగిరి సిద్దు పాల్గొన్నారు.

మతిస్థిమితం లేని వృద్ధుడి మృతి

వెల్గటూర్: కిషన్‌రావుపేట గ్రామానికి చెందిన మానాల మల్లయ్య(55) అనే వ్యక్తి మతిస్థిమితం సరిగా లేక వారం రోజుల క్రితం ఎవరికీ చెప్పకుండా ఇంటి నుంచి వెళ్లిపోయాడు. గురువారం సంకెనపెల్లిలోని శ్మశాన వాటిక గదిలో మల్లయ్య మృతదేహం పడి ఉంది. వారం రోజులుగా ఎలాంటి ఆహార పదార్థాలు, నీరు తీసుకోకపోవడంతో మృతిచెంది ఉంటాడని మృతుడి అన్న మానాల ప్రభుదాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్వేత తెలిపారు.

కేంద్రాలు కళకళ.. కొనుగోళ్లు వెలవెల

- ధాన్యం కొనుగోలుకు 403 కేంద్రాలు
- 5లక్షల టన్నుల ధాన్యం సేకరణకు ఏర్పాట్లు
- పేరుకుపోతున్న నిల్వలు.. పట్టని అధికారులు
- మబ్బులతో రైతుల్లో అయోమయం



సారంగాపూర్ ఐకేపీ కొనుగోలు కేంద్రంలో పోసిన ధాన్యం

జగిత్యాలరూరల్: జిల్లాలో వరి కోతలు ప్రారంభమైన సుమారు 20 రోజులు గడుస్తోంది. దిగుబడి కూడా కొనుగోలు కేంద్రాలకు చేరుతోంది. ఇప్పటికే కేంద్రాల్లో ధాన్యం ఆరబెట్టిన రైతులు కేంద్రాలను ఎప్పుడు తెరుస్తారోనని ఎదురుచూస్తున్నా రు. మరోవైపు ఆకాశం ప్రతిరోజూ మబ్బులు పడుతూ ఉండడం.. కొన్నిచోట్ల వర్షం కురుస్తుండడంతో రైతులు అయోమయానికి గురవుతున్నారు.

జిల్లాలో 403 కేంద్రాలు..

జిల్లాలో ధాన్యం కొనుగోళ్లకు 129 ఐకేపీ, 274 సహకార సంఘాల ఆధ్వర్యంలో (మొత్తం 403) కేంద్రాలు ఏర్పాటు చేస్తామని జిల్లా యంత్రాంగం ప్రకటించింది. వీటిద్వారా సుమారు ఐదు లక్షల టన్నుల ధాన్యం సేకరించేందుకు ఏర్పాట్లు చేస్తామని ప్రకటించారు. కానీ ఇప్పటివరకు ఎక్కడా కొనుగోళ్లు మాత్రం ప్రారంభం కాలేదు. కేవలం కేంద్రాలను ప్రారంభించి మమ అనిపిస్తున్నారని, వర్షం వస్తే తమ పరిస్థితి ఏమిటని రైతులు అంటున్నారు. ప్రతి కేంద్రానికీ ఎలక్ట్రానిక్ కాంటా, తేమ పరిశీలించే యంత్రం, టార్పాలిన్లు, ప్యాడీక్లీనర్లను సిద్ధంగా ఉంచారు.

45 మిల్లర్లకు ధాన్యం కేటాయింపు

జిల్లాలో సేకరించిన ధాన్యాన్ని తరలించేందుకు జిల్లాలోని 45 రైస్‌మిల్లులను గుర్తించారు. వాటికి దిగుమతి కేటాయింపులు చేశారు. తూకం వేసిన ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలించేలా ఏర్పాట్లు చేయడంతోపాటు, మిల్లుల్లో వెంటనే అన్‌లోడ్ చేసేలా హమాలీల కొరత లేకుండా చూసుకోవాలని అధికారులను ఆదేశించారు. ధాన్యాన్ని పూర్తిగా ఆరబెట్టి.. తప్పతాలు లేకుండా చూసుకునే కేంద్రానికి తరలించాలని మహిళాసంఘాల ద్వారా వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. నేరుగా రైతులు కొనుగోలు కేంద్రానికి తీసుకొస్తే ధాన్యం ఆరబెట్టడంలో ఇబ్బందులు తలెత్తుతాయని అంటున్నారు.

403 కేంద్రాలు ఏర్పాటు



ధాన్యం కొనుగోళ్లలో ఇబ్బంది తలెత్తకుండా జిల్లాలో 403 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశాం. కేంద్రాల్లోనూ అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నాం. కొనుగోళ్లు పూర్తయ్యేవరకూ సెంటర్లను కొనసాగిస్తాం. – నరేశ్, డీఆర్డీఏ పీడీ

ధర్మపురి బరిలో సింగరేణి బిడ్డలు

- మూడు ప్రధాన పార్టీల నుంచి ఖనివాసులకే అభ్యర్థిత్వం
- నాలుగు పర్యాయాలు మంత్రి ఈశ్వర్‌కే పట్టం



మంత్రి ఈశ్వర్ | అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ | ఎస్.కుమార్

గొల్లపల్లి: ధర్మపురి నియోజకవర్గ బరిలో పోటీ పడుతున్న ముగ్గురు ప్రధాన పార్టీల అభ్యర్థులు గోదావరిఖనికి చెందినవారే. గోదావరిఖని నుంచి ఇక్కడ పోటీ చేస్తూ తమ సత్తా చాటుతున్నారు. మేడారం నుంచి రెండుసార్లు, ధర్మపురి నుంచి నాలుగుసార్లు విజయం సాధించి రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వహిస్తున్న బీఆర్‌ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్‌తో పాటు ఉమ్మడి కరీంనగర్ జిల్లాపరిషత్ మాజీ చైర్మన్, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్, ప్రస్తుత జగిత్యాల జిల్లా డీసీసీ అధ్యక్షుడు, కాంగ్రెస్ అభ్యర్థి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, బీజేపీ అభ్యర్థి సోగాల కుమార్ గోదావరిఖని ప్రాంతానికి చెందినవారే. ఎస్సీ రిజర్వు స్థానంలో ఉన్న మేడారం నియోజకవర్గం ధర్మపురి నియోజకవర్గంగా మారడంతో.. రామగుండం ప్రాంతానికి చెందిన నేతలు ధర్మపురి బరిలో తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. 2009లో ధర్మపురి ఎస్సీ నియోజకవర్గంగా మారడంతో ఇదే ముగ్గురు అభ్యర్థులు ప్రధాన పార్టీలైన బీఆర్‌ఎస్, కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులుగా పోటీలో నిలిచారు. సింగరేణి కార్మికుల బిడ్డలైన ఈ ముగ్గురు ఎస్సీ సామాజిక వర్గానికి చెందినవారు కావడంతో.. ధర్మపురి నుంచి పోటీ చేస్తున్నారు. వీరి చదువు గోదావరిఖనిలోనే సాగింది. ఇప్పటికే ధర్మపురి నుంచి నాలుగు సార్లు పోటీలో నిలిచిన కాంగ్రెస్ అభ్యర్థి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్.. 2018 ఎన్నికల్లో 431 ఓట్ల స్వల్ప తేడాతో ఓటమిపాలయ్యారు. ఇక ధర్మపురి నుంచి బరిలో నిలిచిన ప్రతిసారి విజయం సాధిస్తూ వస్తున్న కొప్పుల ఈశ్వర్ ఈసారి కూడా గెలుస్తానని ధీమా వ్యక్తం చేస్తున్నారు. 2009లో బీజేపీ తరఫున పోటీ చేసిన సోగాల కుమార్ 2014, 2018 ఎన్నికలకు దూరంగా ఉన్నారు. గత పార్లమెంట్ ఎన్నికల్లో పెద్దపల్లి బీజేపీ ఎంపీ అభ్యర్థిగా పోటీ చేసిన చేసిన సోగాల కుమార్‌ను ఈసారి ధర్మపురి అభ్యర్థిగా అధిష్టానం బరిలో దింపుతోంది. ఈ ముగ్గురి స్వస్థలాలు పెద్దపెల్లి జిల్లానే కావడం విశేషం. నియోజకవర్గంలో నాలుగు సార్లు ఎమ్మెల్యేగా గెలిచి చీఫ్ విప్, మంత్రి పదవులు అలంకరించిన మంత్రి ఈశ్వర్‌తో పాటు నాలుగు పర్యాయాలు ఈశ్వర్‌కు ప్రత్యర్థిగా పోటీ చేసి ఓటమి చెందిన అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, 2009లో పోటీ చేసి తిరిగి 2023లో టికెట్ దక్కించుకున్న ఎస్.కుమార్ తమ అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు బరిలో దిగారు.

పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

సారంగాపూర్: అర్పపల్లి గ్రామంలో బుక్క రాజిరెడ్డి(53) అనే వ్యక్తి పురుగుల మందు తాగి చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. సారంగాపూర్ ఎస్సై తిరుపతి కథనం ప్రకారం.. రాజిరెడ్డి చాలాకాలంగా పక్షవాతంతో బాధపడుతున్నాడు. ఎన్ని మందులు వాడినా నయం కాకపోవడంతో జీవితంపై విరక్తి చెంది బుధవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు చికిత్స కోసం జగిత్యాలకు తరలించారు. పరిస్థితి విషమించడంతో కరీంనగర్‌కు తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ మృతిచెందాడు. భార్య లక్ష్మీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోస్టుమార్టం తరలించారు. మృతుడికి కుమార్తె, కొడుకున్నారు.

విద్యుదాఘాతంతో ఒకరు మృతి



రాజేందర్(ఫైల్)

మేడిపల్లి: భీమారం మండలం గోవిందారం గ్రామంలో గురువారం సాయంత్రం విద్యుదాఘాతంతో ఒకరు మృతిచెందారు. కోరుట్ల మండలం మోహన్‌రావుపేటకు చెందిన గుండవేని రాజేందర్ గోవిందారంలోని అక్క ఇంటికి దీపావళి నోముల సందర్భంగా రంగులు వేయడానికి వెళ్లాడు. రంగులు వేస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు విద్యుత్ తీగలు తగిలి పడిపోగా.. జగిత్యాలలోని ఏరియా ఆసుపత్రికి తరలించారు. అప్పటికే రాజేందర్ మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడికి భార్య రాజమణి, ఇంటర్ చదువుతున్న కూతురు న్నట్లు బంధువులు తెలిపారు.

భోజనాల వద్ద తన్నుకున్న బీఆర్‌ఎస్ నాయకులు



ధర్మపురి: మంత్రి కొప్పుల ఈశ్వర్ ధర్మపురిలో నామినేషన్ వేయగా.. కార్యకర్తలు భారీగా తరలివచ్చారు. వారికోసం ఓ ఫంక్షన్‌లో హాల్‌లో భోజనాలు ఏర్పాటు చేశారు. వడ్డిస్తున్న సమయంలో కొందరు గొడవకు దిగారు. ఒకరిపై ఒకరు బెంచీలు, కుర్చీలు ఎత్తేసుకున్నారు. దీంతో ఫంక్షన్ హాల్ వద్ద ఉద్రిక్త వాతావరణం చోటు చేసుకుంది.

స్వగ్రామానికి గల్ఫ్ కార్మికుడి మృతదేహం

కోరుట్లరూరల్: గుమ్లాపూర్ గ్రామానికి చెందిన గల్ఫ్ కార్మికుడు బోయిని వెంకటయ్య (53) వారం క్రితం ఖతార్‌లో గుండెపోటుతో మృతిచెందగా.. ఆయన మృతదేహం గురువారం స్వగ్రామం చేరింది. కుటుంబ సభ్యులు, బంధువుల రోదనలు మిన్నంటాయి. గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. వెంకటయ్య 30ఏళ్లుగా ఖతార్ వెళ్లి వస్తున్నాడు. ఏడాదిన్నర క్రితం సెలవుపై వచ్చి వెళ్లిన వెంకటయ్య వారం క్రితం పని చేస్తుండగా గుండెపోటు వచ్చింది. తోటి కార్మికులు వెంటనే ఖతార్‌లోని ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆసుపత్రిలోనే మృతిచెందాడు. ఈ విషయం వారి కుటుంబ సభ్యులు గల్ఫ్ సమితి వారికి చేరవేయగా.. వారు ఐసీబీఎఫ్ సహకారంతో మృతదేహాన్ని త్వరగా స్వదేశం తీసుకొచ్చేందుకు కృషి చేశారు. గురువారం వెంకటయ్య మృతదేహం శంషాబాద్ విమానాశ్రయానికి చేరుకోగా.. ప్రభుత్వం ఉచిత అంబులెన్స్ సౌకర్యం కల్పించింది. గల్ఫ్ సమితి సభ్యులు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. వెంకటయ్యకు భార్య లక్ష్మీ, ముగ్గురు కూతుళ్లు. అందరికీ వివాహమైంది. వెంకటయ్య కుటుంబానికి ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని గల్ఫ్ సమితి సభ్యులు డిమాండ్ చేశారు.

కుల సంఘాల మద్దతుపై ప్రత్యేక దృష్టి

- వారి కోసం ప్రత్యేక సమావేశాలు.. ఆత్మీయ సమ్మేళనాలు
- కుల పెద్దలకు పలు హామీలు

బుగ్గారం: అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా వివిధ రాజకీయ పార్టీలు కుల సంఘాల మద్దుతుకు తీవ్రంగా శ్రమిస్తున్నాయి. పలు సంఘాల ముఖ్య నాయకులను కలుస్తూ వారిపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. పలు ప్రాంతాల్లో ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహిస్తూ వారి మద్దతు కూడగట్టేందుకు వివిధ రాజకీయ పార్టీలు పోటీ పడుతున్నాయి. ఇందుకోసం ఆయా కులాల్లోని తమ పార్టీ నాయకుల ద్వారా ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేయించి తమకే మద్దతు తెలపాల్సిందిగా ప్రచారం నిర్వహిస్తున్నాయి. ఇదే అవకాశంగా భావించిన కుల సంఘాల నాయకులు తమ సంఘం డిమాండ్లను ఆయా రాజకీయ పక్షాల ముందుంచుతున్నాయి. పనిలో పనిగా తమ వ్యక్తిగత డిమాండ్లను కూడా తమ పార్టీ పెద్దల ముందు పెట్టి వారి రాజకీయ భవిష్యత్తు కోసం భరోసా తీసుకుంటున్నారు. ఈ సంధర్భంగా పోటీ చేసే అభ్యర్థులు సైతం పలు హామీలనిస్తున్నారు. ఆయా కుల సంఘాల ఓట్లు గంపగుత్తగా కొల్లగొట్టేందుకు సంఘ పెద్దలకు పలు హామీలనిస్తూ తమవైపు తిప్పుకుంటున్నారు.

తలెత్తుతున్న విబేధాలు

ప్రతీ కుల సంఘంలో వివిధ పార్టీలకు చెందిన ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలుండడంతో.. ఎన్నికల వేళ ఆయా సంఘాల్లో విబేధాలు తలెత్తుతున్నాయి. ప్రధానంగా బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీల నాయకులు తమ సంఘాలను తమ పార్టీల సమావేశాల కోసం సిద్ధం చేస్తుండడంతో గ్రూపులుగా విడిపోతున్నారు. దీంతో సంఘాల్లో ఐక్యత దెబ్బతింటోందని పలువురు తటస్థులు వాపోతున్నారు. అసలు సంఘాలు బాహాటంగా వివిధ పార్టీలకు మద్దతు తెలపడమే సరికాదని పలువురంటున్నారు. తాము మద్దతిచ్చిన వ్యక్తి ఎన్నికల్లో గెలవకుంటే పరిస్థితి ఏమిటని వారు ప్రశ్నిస్తున్నారు. ఇలాంటి చర్యలతో కుల సంఘానికంటే నాయకులకే ఎక్కువగా లబ్ధి జరుగుతుందని ఆరోపిస్తున్నారు. కుల సంఘాల్లో గ్రూపులు ఏర్పడి ఐక్యత లోపిస్తుందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో సోషల్ మీడియా వేదికగా వివిధ కుల సంఘాల నాయకులు ఒకరిపై మరొకరు తీవ్రమైన ఆరోపణలు చేసుకుంటున్నారు.

ఆయా కుల సంఘాల నాయకులు తెలిపిన వివరాల ప్రకారం జగిత్యాల జిల్లాలో వివిధ కులాల ఓటర్లు(సుమారుగా)

మున్నూరుకాపు	1,25,000
పద్మశాలి	1,10,000
గౌడ	89,000
మాదిగ	96,000
మాల	34,000

జగిత్యాల జిల్లాలోని ఓటర్లు (నియోజకవర్గాల వారీగా)

కోరుట్ల	2,38,403
జగిత్యాల	2,29,242
ధర్మపురి	2,25,576
మొత్తం	6,93,221